క్లుప్తంగా

వైఎస్సార్ బీమా అందజేత



బసవ తోటయ్య కుటుంబానికి బీమా పరిహారం అందిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు గాంధీనగర్‌కు చెందిన బసవ తోటయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. గాంధీనగర్‌లో శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా పరిహారం కింద రూ.10 వేలను నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అందజేశారు. కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా చందనోత్సవం



చాదర్‌ను ర్యాలీగా తీసుకెళ్తున్న ముస్లింలు

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు మద్రిపాలెం రైల్వే క్వార్టర్స్‌లోని హజ్రత్ కాజా గరీబ్ నవాజ్ నిషాని వద్ద కేజీఎన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం చందనోత్సవం ఘనంగా నిర్వహించారు. ముస్లింలు ఉదయం మసీదు ప్రాంగణంలో ఖురాన్ పఠించారు. సాయంత్రం చిన్నారులు నాత్తే కళాములు ఆలపిస్తూ మద్రిపాలెం, హుస్సేన్‌నగర్, గ్రీన్ గార్డెన్స్, పార్వతీనగర్ ప్రాంతాల్లో చాదర్(పవిత్ర వస్త్రం)తో చందనోత్సవ ర్యాలీ చేశారు. వేడుకల్లో భాగంగా శనివారం ప్రముఖ మత పెద్దలతో తకృర్(బయాన్) పఠించి దావత్ నిర్వహిస్తామని ఉర్స్ కమిటీ సభ్యులు తెలిపారు. చందనోత్సవం అనంతరం చాదర్‌ను అజ్మీర్ షరీఫ్‌లోని హజ్రత్ కాజా గరీబ్ నవాజ్ సమాధి వద్ద సమర్పిస్తామన్నారు. పెద్ద సంఖ్యలో స్థానిక ముస్లింలు పాల్గొన్నారు.

గ్రీన్‌బెల్ట్‌ల ఆక్రమణలపై అవగాహన ర్యాలీ



ప్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

సీతమ్మధార: జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం ఫుట్‌పాత్, గ్రీన్‌బెల్ట్‌ల ఆక్రమణలపై సీతమ్మధార అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. టీపీఎస్ తేజ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను, కాలిబాటలను ఆక్రమించడం, వాహనాలు నిలపడం, వ్యాపారాలు నిర్వహించడం చేయరాదన్నారు. ప్రజలకు అసౌకర్యం కలిగించవద్దని అవగాహన కల్పించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే తొలగిస్తామన్నారు. చైన్‌మేన్ ప్రసన్నరాజు, ప్లానింగ్ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

లలితాకామేశ్వరుల కల్యాణ వైభోగం



లలితాకామేశ్వరుల కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు

- విశేష అలంకరణలో ఉత్సవ విగ్రహాలు
- తిలకించి తరించిన భక్తజనం

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో జరుగుతున్న 74వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం లలితాకామేశ్వరుల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. కుర్తాళం, లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి పర్యవేక్షణలో పీఠం ఆస్థాన వేద పండితుడు మాచవోలు రమేష్ శర్మ వేదమంత్రాల నడుమ కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ సందర్భంగా పీఠం దర్బారు హాల్‌ను విద్యుత్ దీపాలు, మామిడి తోరణాలు, పూలదండలు, అరటిచెట్లతో ముస్తాబు చేసి కల్యాణ వేదికను సుందరంగా తీర్చిదిద్దారు. లలితాకామేశ్వరుల ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలు, ఆభరణాలతో చూడముచ్చటగా అలంకరించారు. కల్యాణంలోని ముఖ్య ఘట్టాలైన సుమూహూర్తం, మంగళ సూత్రధారణ, తలంబ్రాలు కళ్లకు కట్టినట్టు చూపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని వీక్షించారు. అమ్మవారి కల్యాణం అనంతరం భక్తులకు ప్రసాదం, తలంబ్రాలు పంచిపెట్టారు. కల్యాణోత్సవంలో భాగంగా ఉదయం పంచామృతాలతో విశేష అభిషేకాలు జరిపారు. మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

నేడు గ్రామోత్సవం

లలితాదేవి అమ్మవారి గ్రామోత్సవం శనివారం సాయంత్రం 6.30 గంటలకు అంగరంగ వైభవంగా జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతీ స్వామిని, కుర్తాళం పీఠం సీఈవో మోచర్ల శశిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆనందమే ప్రభుత్వ లక్ష్యం



24వ వార్డులో మహిళలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: ప్రజలందరి కళ్లల్లో ఆనందం చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 24వ వార్డు నక్కవానిపాలెం తదితర ప్రాంతాల్లో మూడు రోజు శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. కార్పొరేటర్ సాడి పద్మారెడ్డితో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికే గడప గడపకు కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏ పథకం కావాలన్నా కార్యాలయాలు, ప్రజాప్రతినిధుల చుట్టూ కాళ్లరిగేలా ప్రజలు తిరగాల్సి వచ్చేదని గుర్తు చేశారు. సీఎంగా జగనన్న బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రభుత్వ అధికారులు ప్రజల ముంగిటకే వచ్చి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, పార్టీ నాయకులు జి.వి.రమణి, రాయుడు శ్రీను, నూకరాజు జి.అశోక్‌రెడ్డి, గురుమూర్తిరెడ్డి, సీతాకుమారి, ప్రకాష్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, సాడి కేశవరెడ్డి, చలపతిరెడ్డి పాల్గొన్నారు.

నిర్ణీత ధరలకే కూరగాయల విక్రయాలు



రైతుల కార్డులను పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖ అధికారి యాసిన్

సీతమ్మధార: రైతుబజార్లలో రాష్ట్ర ప్రభుత్వం, మార్కెటింగ్ శాఖ నిర్ణయించిన ధరలకే కూరగాయలు విక్రయించాలని జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ శాఖ అధికారి ఎస్.కె.యాసిన్ తెలిపారు. సీతమ్మధార రైతుబజారులో శుక్రవారం ఆయన తనిఖీలు చేశారు. రైతుల ఐడీ కార్డులను, డ్వాక్రా సంఘాల ఉల్లి విక్రయాలను పరిశీలించారు. సక్రమంగా తూనికలు వేస్తున్నారా లేదా తనిఖీలు చేపట్టారు. సూపర్ బజార్, డీసీఎం ఏర్పాటు చేసిన కౌంటర్ల ధరలను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యాసిన్ మాట్లాడుతూ నిర్ణీత ధరలకు నాణ్యమైన కూరగాయలు విక్రయించాలని సూచించారు. ప్రతి రైతు ఐడీ కార్డు వేసుకొని ఉండాలని, వినియోగదారులతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. సరిపడ చిల్లర ఉంచుకోవాలని, తూనికలు సరిగా పనిచేసేలా ఉంచుకోవాలన్నారు. హోల్‌సేల్‌కు ముందుగా కూరగాయలు విక్రయించరాదని చెప్పారు. అధికారి వెంట రైతుబజార్ ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్ ఉన్నారు.

రాంగ్ పార్కింగ్ వాహనాలపై కొరడా

మద్రిపాలెం: నిబంధనలు అతిక్రమించి రోడ్డు పక్కనే పార్క్‌చేసిన భారీ వాహనాలపై కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝులిపించారు. ఈ మేరకు శుక్రవారం జ్ఞానాపురం నుంచి కంచరపాలెం వరకు రాంగ్ పార్కింగ్ చేసిన సివిల్ సప్లై లోడుతో ఉన్న లారీలపై డ్రైవ్ నిర్వహించామని సీఐ మళ్ల అప్పారావు తెలిపారు. ఆ ప్రాంతాల్లో స్కూళ్లు ఎక్కువగా ఉన్నాయని, ట్రాఫిక్ సమస్య, ప్రజలకు అంతరాయం కలిగిస్తున్నాయని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో సుమారు 50 లారీలు వరుసగా రాంగ్ పార్కింగ్ చేసి వున్నాయని, వాటిలో 49 వాహనాలపై కేసులు నమోదు చేశామన్నారు. కొన్ని లారీలు ఓవర్‌లోడుతో ఉన్నాయని, ఈ మేరకు ఆర్‌టీవోకి సమాచారం అందించి జరిమానాలు విధించామని సీఐ తెలిపారు.

సీతంరాజు సుధాకర్‌ను గెలిపిద్దాం



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్. చిత్రంలో సమన్వయకర్త కె.కె.రాజు

సీతమ్మధార: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించుకోవాలని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు పిలుపునిచ్చారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీతంరాజు సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో బూత్ కమిటీలు వేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సచివాలయం-వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు నేరుగా అందుతున్నాయన్నారు. పార్టీలకతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, ఉత్తరాంధ్ర అభివృద్ధికి పాటుపడుతున్న విషయం అందరికీ తెలుసని పేర్కొన్నారు. ప్రతి ఓటర్‌ను మోటివేట్ చేసి ఎమ్మెల్సీ అభ్యర్థికి ఓటు వేయించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

సీఎం జగన్ పాలనలో స్వర్ణయుగం

సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకుంటే స్వర్ణయుగం వస్తుందన్నారు. టీడీపీ పూర్తిగా భూస్థాపితమవుతుందని జోస్యం చెప్పారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, కె.కామేశ్వరి, వి.ప్రసాద్, చల్లా రజని, శశికళ, కో-ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, పార్టీ వార్డు అధ్యక్షులు గుజ్జు వెంకటరెడ్డి, పైడి రమణ, పీలా వెంకటలక్ష్మి, నీలి రవి, పి.రత్నాకర్, డి.శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్లు బులుసు జగదీష్, సీనియర్ నాయకుడు పోతు సత్యనారాయణ, సచివాలయం కన్వీనర్లు, డైరెక్టర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సకాలంలో గుర్తిస్తే క్యాన్సర్ నివారణ



క్యాన్సర్ నివారణపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు, మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: క్యాన్సర్ లక్షణాలను సకాలంలో గుర్తించి డాక్టరును సంప్రదిస్తే నివారణ సాధ్యమవుతుందని మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ఎం.శేషామణి అన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం బి.హేమలత అధ్యక్షతన నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. క్యాన్సర్ వ్యాధి లక్షణాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. మంచి ఆహారపు అలవాట్ల ద్వారా క్యాన్సర్‌ను నియంత్రించవచ్చని చెప్పారు. ముఖ్యంగా జంక్ ఫుడ్ తినడం వల్ల కొన్ని రకాల క్యాన్సర్‌లు వచ్చే అవకాశముందన్నారు. విద్యార్థులు జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని, నడక, వ్యాయామం చేయడం వల్ల ఆరోగ్యవంతంగా ఉండవచ్చని సూచించారు. క్యాన్సర్ నివారణపై విద్యార్థులు, క్లబ్ సభ్యులు ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల నుంచి తెన్నేటినగర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. తెన్నేటినగర్‌లో రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్న ఎ.రామలక్ష్మికి పండ్లు, చీర, మందుల కోసం కొంత నగదు మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు అందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి సనపల పుష్పలత, పూర్వ అధ్యక్షులు కె.మాధవి, డి.శిరీష, ఉపాధ్యక్షురాలు లీలా నాయుడు, పూర్ణిమ, మహలక్ష్మి, పాల్గొన్నారు.

భావితరాలకు నైపుణ్య ఆధారిత విద్య

కంచరపాలెం: భావితరాల వారికి నైపుణ్యత కలిగిన విద్యను అందించాలని ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ చీఫ్ కో-ఆర్డినేటింగ్ అధికారి బుద్ధ చంద్రశేఖర్ పేర్కొన్నారు. నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రెండో రోజు శుక్రవారం కంచరపాలెం పాత ఐటీఐలో అప్రెంటిస్‌షిప్ జాతీయ వర్క్‌షాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 300కు పైగా పరిశ్రమలు కేంద్ర ప్రభుత్వ విధానాలను స్వాగతిస్తూ విద్యార్థులకు అప్రెంటిస్‌షిప్‌కు అవకాశం కల్పిస్తున్నాయని తెలిపారు. భవిష్యత్‌లో స్కిల్ బేస్డ్ ఎడ్యుకేషన్‌కు ప్రాధాన్యమివ్వాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఎస్డీ ఆంధ్రప్రదేశ్-తెలంగాణ ప్రాంతీయ సంచాలకుడు కె.శ్రీనివాసరావు, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ చైర్మన్ అజయ్‌రెడ్డి, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సుబ్బిరెడ్డి, జన శిక్షణ సంస్థ చైర్మన్ రామరాజు, కంచరపాలెం, గాజువాక ఐటీఐల ప్రిన్సిపాళ్లు బి.ప్రభాకర్‌రావు, ఎ.కె.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

సినీ కళామతల్లి ముద్దుబిడ్డ విశ్వనాథ్



సినీ దిగ్గజం కె.విశ్వనాథ్‌కు నివాళులర్పించి మాట్లాడుతున్న సత్యనాథం

మురళీనగర్: కళామతల్లి ముద్దుబిడ్డ కళాతపస్వి కె.విశ్వనాథ్ మృతి సినీ పరిశ్రమతోపాటు తెలుగు ప్రజలకు తీరని లోటని వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు సెక్రటరీ జనరల్ రాళ్లపల్లి సత్యనాథం అన్నారు. దివికేగిన సినీ దిగ్గజ దర్శకుడు, నటుడు కె.విశ్వనాథ్‌కు సంతాపంగా మురళీనగర్ వాకర్స్ క్లబ్ సభ్యులు శుక్రవారం వాకర్స్ పార్కులో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సత్యనాథం మాట్లాడుతూ తెలుగు భాష, భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ప్రపంచ వ్యాప్తం చేసిన ఘనత కె.విశ్వనాథ్‌కే దక్కుతుందన్నారు. ఆయన లేని లోటు తీర్చలేనిదన్నారు. కళాతపస్విగా సినీ పరిశ్రమలో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, వాకర్స్, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

కళాతపస్వి మరణం తీరని లోటు



కె.విశ్వనాథ్‌తో పద్మశ్రీ డాక్టర్ కూటికుప్పల సూర్యారావు(ఫైల్)

కంచరపాలెం: కళాతపస్వి కె.విశ్వనాథ్ మరణం తీరని లోటని పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కూటికుప్పల సూర్యారావు అన్నారు. కొప్పరపు కళాపీఠం పురస్కారోత్సవాల్లో విశ్వనాథ్‌తో కలిసి పలుమార్లు వేదికను పంచుకోవడం తన అదృష్టమని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని దేవున్ని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు, లక్షలాది విశ్వనాథ్ అభిమానులకు ప్రగాఢ సంతాపాన్ని డాక్టర్ సూర్యారావు తెలియజేశారు.

డ్రైడే-ఫ్రైడే పాటించండి



కనకమ్మ వీధిలో డమ్ములో నీటిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: సీతంపేట బీఆర్‌టీ నగర్, కనకమ్మ గుడి ప్రాంతంలో శుక్రవారం డ్రైడే-ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, తాగునీటిపై మూతలు సరిగా ఉంచుకోవాలని స్థానికులకు సూచించారు. డెంగ్యూ, మలేరియా జ్వరాల నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసర ప్రాంతాలను, ఓపెన్ డ్రైనేజీని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే-ఫ్రైడే పాటించాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ సరకుల పంపిణీ



కార్డుదారులకు రేషన్ అందిస్తున్న సిబ్బంది

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలో ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ సరకులను కార్డుదారులకు అందించారు. రేషన్ పంపిణీ వాహనం వద్ద గోధుమపిండితోపాటు ఇతర సరకులను అందజేశారు.

ప్రగతిశీల ఆలోచనలతో కేంద్ర బడ్జెట్

ఏయూక్యాంపస్: ప్రగతిశీల ఆలోచనలతో కేంద్ర బడ్జెట్ రూపొందించారని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి అన్నారు. ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన 'యూనియన్ బడ్జెట్-2023' చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విశ్వవిద్యాలయాలకు జీఎస్టీ నుంచి మినహాయింపు ఇవ్వడం, కొంత వెసులుబాటు కల్పించడం ఎంతో అవసరమన్నారు. డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కల్పనకు కేంద్రం ప్రత్యేక దృష్టి సారించడం శుభ పరిణామమన్నారు. ఇది ప్రగతిశీల ఆలోచనగా నిలుస్తుందని పేర్కొన్నారు.

సంస్కృతి సంప్రదాయాలు కాపాడాలి

నెహ్రూ యువ కేంద్రం రాష్ట్ర సంచాలకురాలు విజయరావు



గిరిజన విద్యార్థులతో నెహ్రూ యువకేంద్రం రాష్ట్ర సంచాలకురాలు విజయరావు

మహారాణిపేట: భారతీయ సంస్కృతి సంప్రదాయాలపై యువత అవగాహన పెంచుకోవాలని నెహ్రూ యువ కేంద్రం రాష్ట్ర సంచాలకురాలు ఎ.ఆర్.విజయరావు సూచించారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, యువజన క్రీడా మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నెహ్రూ యువ కేంద్రం, విశాఖ ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న 14వ ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ ముగింపు కార్యక్రమం శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా విజయరావు మాట్లాడుతూ సభ్యత సంస్కారానికి, సంస్కృతి,సంప్రదాయలకు భారతదేశం నిలయమన్నారు. అందుకే మనదేశం మిగతా దేశాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. యువత సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. గత నెల 28వ తేదీన ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా, బస్తర్, కంకేర్, నారాయణపూర్, రాజ్‌నంద్‌గావ్ జిల్లాలు, జార్ఖండ్‌లోని గుమ్లా, కుంటి, లోహర్‌దగా, లతేహర్ జిల్లాలు, ఒడిశా రాష్ట్రంలోని ఖండమాల్ జిల్లాల నుంచి 220 మంది గిరిజన యువతీ యువకులు పాల్గొన్నారు. విశాఖలోని స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, కైలాసగిరి, సబ్‌మెరైన్ మ్యూజియం, ఆర్.కె.బీచ్ తదితర ప్రాంతాలను వారు సందర్శించారు. ముగింపు కార్యక్రమంలో విశాఖ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బి.రామ్‌నరేష్, సమగ్ర శిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, జిల్లా యువజన అధికారి జి.మహేశ్వరరావు, విజయనగరం జిల్లా యువజన అధికారి జి.విక్రమాదిత్య, ఇతర అధికారులు ఎం.సి.బాబురెడ్డి, శ్రీనివాస్, రాంప్రసాద్, వి.పి.దేవి పాల్గొన్నారు.

6 నుంచి విశాఖలో ఫిల్మ్ ఫెస్టివల్

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు విశాఖలో ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు సొసైటీ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఫెస్టివల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి తెలుగు టాకీ సినిమా భక్త ప్రహ్లాద విడుదలై 91 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలుగు టాకీ సినిమా ఆవిర్భావ ఉత్సవాల్లో భాగంగా ఈ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విశాఖ పౌర గ్రంథాలయంలో ప్రతి రోజూ సాయంత్రం 5.45 గంటల నుంచి పలు చిత్రాల ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ నెల 6న జమున నటించిన..ఉండమ్మా బొట్టు పెడతా, 7న మాలపిల్ల, 8న విరాటపర్వం సినిమాలు ప్రదర్శించనున్నట్లు చెప్పారు. ప్రవేశం ఉచితమని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వీజేఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు , వైజాగ్ ఫిల్మ్ సొసైటీ గౌరవాధ్యక్షుడు ఎస్‌డీ పాల్, సభ్యులు సంతోష్‌కుమార్, డాక్టర్ బాబ్జి పాల్గొన్నారు.

ఫిల్మ్ మేకింగ్‌పై వర్క్‌షాప్..

ఫెస్టివల్‌లో భాగంగా ఫిల్మ్‌మేకింగ్‌పై 7న ఉదయం 10 గంటలకు పౌరగ్రంథాలయంలో ప్రముఖ సినీ దర్శకుడు వీఎన్ ఆదిత్య (మనసంతా నువ్వే ఫేం) వర్క్‌షాప్ నిర్వహించనున్నారని నరవ ప్రకాశరావు తెలిపారు. ఈ వర్క్‌షాపునకు 18ఏళ్లు దాటిన వారు అర్హులని, మరిన్ని వివరాలకు 9441571581, 9032477463 నంబర్లలో సంప్రదించవచ్చు.

కేశాల విరాళం అభినందనీయం

మేయర్

ఆరిలోవ: క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు కేశాలు విరాళం ఇవ్వడం అభినందనీయమని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం హెల్త్‌సిటీలోని హెచ్‌సీజీ క్యాన్సర్ ఆస్పత్రిలో కేశాల విరాళ కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడ పని చేస్తున్న ఉద్యోగులతోపాటు నగరానికి చెందిన కొందరు మహిళలు వారి కేశాలు విరాళంగా అందించారు. వీరిలో ఇద్దరు చిన్నారులు కూడా ఉండటం విశేషం. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ క్యాన్సర్‌పై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు ధైర్యంతో ఉండాలని.. అలాంటప్పుడే వ్యాధిని అధిగమించగలరన్నారు. హెచ్‌సీజీ అంకాలజీ విభాగం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు, రేపు ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక 7వ వార్షికోత్సవం



మాట్లాడుతున్న కె.ఎస్.మల్లేశ్వరి

కూర్మన్నపాలెం : విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి, దేశం గర్వపడేలా తీర్చిదిద్దడమే ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక 7వ వార్షికోత్సవం ముఖ్య లక్ష్యమని ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ కార్యదర్శి కె.ఎస్.మల్లేశ్వరి అన్నారు. శని,ఆదివారాల్లో ప్రజాస్వామిక రచయిత్రల వేదిక 7వ వార్షికోత్సవం పురస్కరించుకుని జీవీఎంసీ 86వ వార్డు పరిధి కూర్మన్నపాలెంలోని ఓ హోటల్‌లో శుక్రవారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 4,5 తేదీల్లో ఉక్కు నగరం సమీపంలోని దేశపాత్రునిపాలెం సంస్కృతి గ్లోబల్ హైస్కూల్‌లో ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక 7వ వార్షికోత్సవం ఘనంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ఉత్సవంలో వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో పాటు కవులు, రచయితలు, సాహితీవేత్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ వేదికలో రెండు తెలుగు రాష్ట్రాల రయితలు, కవులు, సాహితీవేత్తలు పాల్గొంటారన్నారు. కవులు, రచయితలు మమత, సత్య, గోపి మాట్లాడుతూ వ్యాసం, కథ, కవిత్వం, పాట, ప్రక్రియలపై విద్యార్థుల మనోభావాలను పంచుకోవడం సంతృప్తినిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ సమన్వయకర్త మానస ఎండ్లూరి, ఏపీటీఎస్ రాష్ట్ర నాయకులు వెంకటపతిరాజు, సంస్కృతి గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి, కథా రచయిత దగ్గుబాటి పద్మాకర్, చిన్నపిల్లల కథా రచయిత అనిల్ తదితరులు పాల్గొన్నారు.